# ఇంజనీరింగ్ నిరుద్యోగులకు శుభవార్త

- ఏపీ జెన్కో ట్రాన్స్‌కోలో ఏఈ పోస్టుల భర్తీకి సీఎం గ్రీన్‌సిగ్నల్
- ఆర్థిక శాఖ ఆమోదం వచ్చిన వెంటనే నోటిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ నిరుద్యోగులకు శుభవార్త. ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ల పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పవర్ జెనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్కో), ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీట్రాన్స్‌కో) సమాయత్తమవుతున్నాయి. జెన్కోలో ఖాళీగా ఉన్న 250, ట్రాన్స్‌కోలో ఖాళీగా ఉన్న 210 సహాయ ఇంజనీరు పోస్టుల భర్తీకి ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ కోరారు. ఇప్పటికే ఈ పోస్టులకు ఆమోద ముద్ర ఉన్నందున.. ఖాళీలను భర్తీ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ ప్రభుత్వానికి ఫైల్ పంపారు. ఈ ప్రతిపాదనకు పరిపాలనా ఆమోదం లభించింది. ఆర్థిక శాఖ పరిశీలనకు వెళ్లింది. ఈ పోస్టులన్నింటికీ ఆమోదం ఉండడం.. సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో.. ఆర్థిక శాఖ కూడా సానుకూలంగానే స్పందిస్తుందని జెన్కో, ట్రాన్స్‌కో భావిస్తున్నాయి. ఆర్థిక శాఖ ఆమోద ముద్ర వేసిన వెంటనే.. పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ చేసేందుకు జెన్కో, ట్రాన్స్‌కోలు సిద్ధమవుతున్నాయి. దాదాపు 460 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులను భర్తీచేసేందుకు సిద్ధంగా ఉన్నామని... ఈ ఫైలుపై ఆర్థిక శాఖ ఆమోదముద్ర పడిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తామని ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ గురువారం 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఖాళీగా ఉన్న సహాయ ఇంజనీరు పోస్టులన్నింటినీ త్వరితగతిన భర్తీ చేస్తామని తెలిపారు.